# ఈ ఇల్లు

**చూ**డండి ఈ ఇల్లు ఇప్పుడెట్లా ఉందో! ముందు నుంచి చూస్తే ఈ పాటయినా ఇల్లనిపిస్తుంది. వెనకవేపు గోడంతా కూలిపోయింది. కప్పు లోపలికి దిగిపోయింది. కప్పు మీద సహం పెంకులైనా లేవు. పెంకులూ ఇటుకలూ వెదురుబద్దలూ ఎవరికి కావలసినవి వారు పట్టుకెళ్ళారు. వెనుకవేపు నూయి పాడుపడిపోయి ఉంది. దాని చుట్టూ కట్టిన బొడ్డు సహమే నిలిచి ఉంది. మిగిలినది లోపలికి విరిగిపోయి ఉంది. ఇది ఒకప్పుడు వొరల బావి. ఇప్పుడు ఒరలు కానరావు. ఏవో పిచ్చి మొక్కలు కూడా లోపల మొలిచాయి. లోపల నీరుంది. కాని లోతు లేదు. పూడిపోయింది బావి. నీరు పాచి పట్టి ఎట్లా ఉందో చూడండి. దొడ్డి యావత్తూ గడ్డి మొలిచి ఎట్లా వుందో! ఏవేవో చెట్లు మొలిచాయి చుట్టూతా. ఇవి ఎవరైనా వేసినవి కావు. ఎవరు వేస్తారు ఇటువంటి చెట్లు? ఈ దొడ్డి నిండా అనేక రకాల క్రిమి కీటకాదులూ, జంతువులూ యథేచ్ఛగా జీవిస్తున్నాయి. వాటికిప్పుడు నర భయంలేదు.

ఈ మొల లోతు గడ్డిలో, ఈ పిచ్చి మొక్కల నీడని నిత్యమూ, అనుక్షణమూ ఎన్నేసి హత్యలు జరుగుతున్నాయో! కాని ఇది యుద్ధ భూమికాదు. ఇక్కడ జరిగే హత్యలు, యుద్ధమూ కాదు. ఇది జీవితం. ఇక్కడి జంతువులు ఒకదాన్నొకటి తింటున్నాయి. అయినా ఇక్కడే అవీ యివీ కూడా పుట్టి పెరుగుతున్నాయి. వేటి వేటి కష్టసుఖాలు అవల్లా అనుభవిస్తూనే వున్నాయి. కాలంతీరి గిట్టిపోతున్నాయి. వాటి స్థానే మరో తరం ప్రాణులు వస్తున్నాయి.

## 2

ఈ ఇంట్లో ఒకప్పుడు మనుషులున్నారంటే నమ్మశక్యం కాదు. ఈ బావిలో నీళ్ళు తాగారంటే అవునా అనిపిస్తుంది. ఈ దొడ్లో మనుష్యలకు పనికి వచ్చే కాయల చెట్లూ పూల చెట్లూ పెరిగాయంటే కాబోలనుకుంటాం.

ఈ ఆవరణలో ప్రస్తుతం పశు పక్షి క్రిమి కీటకాదులు బతికున్నట్లే ఈ ఇంట్లో మనుష్యులు పుట్టారు, పెరిగారు, సుఖపడ్డారు, దుఃఖపడ్డారు, చచ్చారు.

ఉత్తరవేపు గదిలో ఎన్నో కానుపులు జరిగాయి. దక్షిణవేపు గదిలో ఎన్నో గర్భాదానాలు జరిగాయి. అయిదుసార్లు ఇది పెళ్ళిల్లయింది. ఇంటి చుట్టూరా తాటాకు పందిళ్ళు వేశారు. పడమటి వేపు గాడి పొయ్యి తవ్వారు. అన్నాలు వార్చారు. వందలాది జనం పందిళ్ళ కింద భోంచేశారు.

ఈ గుమ్మాల కెన్నిసార్లు తోరణాలు కట్టారో, ఈ మండిగాల కెన్నిసార్లు పసుపు కుంకుమలు పెట్టారో, ఈ గోడల కెన్నిసార్లు సున్నాలు కొట్టారో చెప్పలేం. ఈ ఇల్లూ దొడ్డీ రోజూ ఊడ్చి అందంగా ఉంచారు. గోడలకి రకరకాల పటాలూ, ఫొటోలూ వేళ్ళాడతీశారు. ఎంతో ప్రేమగా ఇంటికి మరమ్మతులు చేసుకున్నారు.

ఈ ఇంటిని చూసి మనుష్యులు గర్వపడ్డారు. దీన్ని చూడగానే మనుష్యుల ప్రాణాలు లేచి వచ్చాయి; ఈ ఇంటి నుంచి బయటకి వెళ్ళిపోవాలంటే మనుషుల హృదయాలు కుంగిపోయినాయి! దీన్ని చూసి ఇతర మనుషులు ఏవగించుకున్నారు; దీన్ని వదిలేసి మనుషులు లేచిపోయారు కూడాను.

ఎటువంటి మరమ్మతులు చెయ్యకపోయినా ఏళ్లతరబడి ఈ ఇల్లు చెక్కు చెదరకుండా ఉన్న రోజులున్నాయి; దీన్ని మనుషులు విడిచిపోయిన రెండేళ్ళ లోగా ఈ ఇల్లు కుప్పున – ప్రేమను కోల్పోయిన హృదయం లాగా – కూలిపోయింది. మనుషులు చేసే చిన్న చిన్న సేవలు – ఊడవటమూ, బూజు దులపటమూ లాటివి – ఇంటికంత బలం ఇస్తాయా? లేక జీవుడుపోయిన మరుక్షణం కళేబరం క్రిముల పాలయినట్లు, మనుషులు పోగానే ఇల్లు కూడా చచ్చిపోతుందా?

## 3

ఈ ఇల్లు అదివరకు బాగుందా, ఇప్పుడే బాగుందా అంటే స్పష్టంగా చెప్పలేను.

ఇప్పుడిక్కడ వాసం చేసే క్రిమి కీటకాలు చెయ్యని అత్యాచారాలు ఈ ఇంటో మనుషులు చేశారు.

ఒకనాటి రాత్రి ఈ వసారాలో ఒక మనిషి తన భార్యను గొంతుకోసి చంపాడు. అది జీవితావసరమైన హత్య కాదు.... హత్య చేసినవాణ్ణి ద్వీపాంతరం పంపారు.

వెనక ఉన్న ఆ బావిలో ఒక ఇల్లాలు ఒక రాత్రి దూకి ప్రాణ త్యాగం చేసుకుంది.

ఈ ఇల్లు యుద్ధరంగంగా చాలాసార్లు మారింది. ఇక్కడ మనుషులు – కలిసి కట్టుగా ఉండలేని మనుషులు – ఘోరంగా పోట్లాడుకున్నారు. కొట్టుకున్నారు. ఈ ఇంటిని పంచుకున్నారు. దీన్ని వడ్డీ వ్యాపారులకు తాకట్టు పెట్టుకున్నారు, అమ్ముకున్నారు.

పోగొట్టుకున్నాక దీనికోసం ఏడిచారు. ఈ ఇంటిని గురించి కలలు కన్నారు. ఇంతకంటె కూడా మంచి ఇళ్ళు చూసి, "ఎంత బాగున్నా మన ఇల్లల్లే ఉండదేం?" అని ఆశ్చర్యపడ్డారు.

ఈ ఇంటి ఆవరణలో అత్యాచారాలు చెప్పరానన్ని జరిగాయి. భర్తలు భార్యలను తన్నారు. అవమానించారు. వీథిలో ఈడ్చారు, గదుల్లో పెట్టి బయట గొళ్ళాలు పెట్టారు.

చిన్నవాళ్ళు పెద్ద వాళ్ళ చేతుల్లో అమానుషంగా తన్నులు తిన్నారు. ఈ గోడలు మండిగాలూ కరుచుకుని దేవుడు కూడా దిక్కులేని స్థితిలో ఉన్నట్లు భావించుకుని ఏడిచారు.

లోకులను ద్రోహం చెయ్యటానికి ఈ ఇంటో గూడుపుఠాణీలు జరిగాయి.

ఒకప్పుడీ ఇంట్లో జూదం కూడా ఆడేవారు. ఒక రాత్రి ఒక పెద్దమనిషి ఆ జూదంలో అయిదువందలు పోగొట్టుకున్నాడు.

## 4

అందుకని ఈ ఇల్లు ఇప్పుడే బాగుందని చెప్పలేను.

కష్టసుఖాలు కావడికుండలు కావచ్చు. జీవితం కావడి కాదు. జీవితం ముందుకు పొయ్యేది. ఇప్పుడిక్కడ నివసించే క్రిమి కీటకాల నుంచి ఎన్నో కోట్ల దశాబ్దాల కాలం ముందుకు పోగా మానవులు వచ్చారు. మానవులే ఈ ఇల్లు కట్టారు.

ఆ సంగతి తెలిసే కాబోలు మానవులున్నంత కాలమూ యీ క్రిమి కీటకాలు ఇక్కడ యథేచ్ఛగా జీవించలేక పోయాయి. మానవులు వెళ్ళిపోయి యీ ఇల్లు చచ్చిపోయే వరకూ వీటి కిక్కడ స్థానం లేకపోయింది.

ఒకప్పుడీ స్థలంలో యీ క్రిమి కీటకాల పూర్వులు నివసించేవి. మనుషులు వచ్చి వాటిని పారదోలారు. నేల బాగు చేశారు, దున్నారు. ఇక్కడ పంటలు పండించారు.

తరువాత మానవులు ఇక్కడే తమ నివాసాలు ఏర్పరుచుకోవటానికి వచ్చారు. చెమట ఓడ్చి యీ ప్రదేశానికి మట్టి తోలారు, దిమ్మిసి కొట్టారు. ఒక చిన్న పాక వేశారు. అందులో నివసించారు. దొడ్లో పాదులు వేసుకున్నారు. ప్రేమతో పెంచుకున్నారు. అనుభవించారు.

కాలక్రమాన పాకను మనుషులు వొదిలి వెళ్ళారు. అది చచ్చిపోయింది.

ఇతర మనుషులు వచ్చారు. చెమటోడ్చి నేల బాగు చేశారు. ఇటుకలు తెచ్చారు, కలప తెచ్చారు, సున్నం తెచ్చి గాను గాడారు, పునాదులు తీశారు, గోడలు లేపారు, ఇల్లు కట్టారు.

మానవుడు సుఖంగా బతకటానికీ, దేవత్వం అందుకోవటానికీ ఏ యే జ్ఞానమూ

నీతీ అవసరమో అవల్లా యీ ఇంటో మనుషులు తెలుసుకున్నారు. ఒకరికొకరు బోధించుకున్నారు. ఆచరించలేకపోయినారు. అత్యాచారాలు చేశారు. దాటి పోయారు.

ఈ ఇంటో పుస్తకాలకి పూజ జరిగింది. మనుషులను మనుషులు ప్రేమించుకున్నారు. ప్రేమ అనేదాన్ని అవగాహన చేసుకోవటానికి ప్రయత్నించారు. ఆకాశాన్ని కౌగలించుకోబోయి మట్టిని కౌగలించారు. విఫలులైనారు. దాటి పోయారు.

ఈ ఇంటో మనుషులు ఒకరికోసం ఒకరు త్యాగాలు చేశారు. ఒకరికొకరు సానుభూతి చూపటానికి ప్రయత్నించారు. కాని పరస్పరం ఒకరినొకరు అర్థం చేసుకోలేక పోయినారు. త్యాగాలకూ, సానుభూతికీ విలువ తెలుసుకోలేక పోయారు, దాటి పోయారు.

## 5

ఈ కళేబరం ఇట్టే ఉండిపోదు. పనివాళ్ళు వస్తారు. దీన్ని లాగేస్తారు - చెమట ఓడ్చుతారు. పెద్ద భవంతి కడతారు - విద్యుద్దీపాలు పెడతారు - ఇతర సౌకర్యాలు చేస్తారు.

దాన్ని అద్దెకిస్తారా? మారు బేరానికి అమ్ముతారా? మళ్ళీ దాన్ని కూడా యుద్ధరంగంగా మారుస్తారా? అందులో కూడా అత్యాచారాలు జరుగుతాయా? మానవులు నీతీ, జ్ఞానమూ, సానుభూతీ, పారస్పర్యమూ అనేవి తెలుసుకోకుండానే అందులో కూడా జీవిస్తారా?

అదీ చచ్చిపోతుంది. అది మామూలు చావు చావదు. దానిమీద ఇంద్రుడు పిడుగులు కురిపిస్తాడు - వరుణుడు దాన్ని సముద్రంలో ముంచేస్తాడు - అది ప్రళయానలంలో భస్మీపటమవుతుంది....

దాని స్థానంలో మరో ఇల్లు వస్తుంది...

***మొదటి ముద్రణ: ఆనందవాణి, 12 డిసెంబర్ 1948***